గ్రూప్-2 పరీక్షా కేంద్రాల తనిఖీ

వినాయక్‌నగర్, డిసెంబర్ 15: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన గ్రూప్-2 మొదటి సెషన్స్ పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. 63 సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. వెంట అదనపు డీసీపీ బస్వారెడ్డి, శంకర్‌నాయక్‌తోపాటు ఏసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు విధులో పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఫిజిక్స్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్, డిసెంబర్ 15: మండలంలోని అంబం పరిధిలో ఉన్న మోడల్ స్కూల్‌లో పార్ట్‌టైం ఫిజిక్స్ టీచర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో బోధించిన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 17 సాయంత్రంలోపు మోడల్ స్కూల్‌లో దరఖాస్తును అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

పొతంగల్, డిసెంబర్ 15: మండలంలోని హంగర్గాఫారం గ్రామంలో కోటగిరికి చెందిన నాయకుడు బర్ల మధు ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంజీవని హాస్పిటల్ డాక్టర్ ఇంతియాజ్ బేగం 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎజాజ్ ఖాన్, విలేజ్ ప్రెసిడెంట్ సజ్జత్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రవికుమార్‌కు అంబేద్కర్ జాతీయ అవార్డు

అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకుంటున్న రవికుమార్

బోధన్, డిసెంబర్ 15 : బోధన్ పట్టణానికి చెందిన మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుడు నీరడి రవికుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు దక్కింది. ఆదివారం దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమణియన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ 17వ జాతీయ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందజేశారు.

పొతంగల్ ప్రయాణ ప్రాంగణం

బస్టాండు పైనుంచి లీకవుతున్న నీరు

అధ్వానంగా పొతంగల్ బస్టాండ్

- ఎక్కడ చూసినా చెత్త దర్శనం
- మరుగుదొడ్ల నిర్వహణ కరువు

పొతంగల్, డిసెంబర్ 15: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పొతంగల్ బస్టాండ్ అధ్వానంగా మారింది. నిర్వాహణ సరిగా లేక బస్టాండ్ చెత్తతో దర్శనమిస్తోంది. పారిశుద్ధ్యపనులు ఎప్పటికప్పుడు చేయకపోవడంతో బస్టాండ్ ఆవరణలో అడుగు పెట్టాలంటే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మహారాష్ట్ర తోపాటు బోధన్, బీర్కూర్ రూట్లలో బస్సులు నడుస్తుంటాయి. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్టాండ్ వెనుక వైపున మురుగు నీరు నిలిచి దుర్వాసన వ్యాపిస్తున్నది. ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోతున్నది. బస్టాండ్ పై భాగాన వాటర్ ట్యాంక్‌కు లీకేజీ ఏర్పడింది. నీరు వృథాగా పోతున్నది. బస్టాండు ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. బస్టాండ్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. తాగు నీరు అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. బస్టాండ్ ఆవరణంలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

పొతంగల్ బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు సరిగా లేక మహిళా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండులో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి. నూతన బస్టాండ్ భవనం నిర్మాణానికి నాయకులు కృషి చేయాలి.

- బజరంగ్ హన్మాండ్లు, పొతంగల్

పదవుల్లో మాలలకు అవకాశం కల్పించాలి

మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లంపల్లి ఎల్లయ్య

ఖలీల్‌వాడి, డిసెంబర్ 15: మంత్రివర్గ విస్తరణలో ఇంకో మంత్రి పదవి మాలలకు ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లంపల్లి ఎల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారని, కానీ మాలలకు ఏఒక్క చైర్మన్ పదవీ ఇవ్వలేదని అన్నారు. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ పదవులు ఇవ్వలేదని, ఈ సారి మాలలకు అవకాశం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పదవులు ఇవ్వాలని, టీజీపీఎస్సీలో మెంబర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాలలు 10 నుంచి 15 శాతం ఉన్నారని, ఆమేరకు ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు దేవీదాస్, వినయ్, దయాసాగర్, పోశెట్టి, మురళి, గంగధర్, చంద్రకాంత్, సాయిలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలీసాగర్ ద్వారా నీటిని విడుదల చేయాలి

రెంజల్, డిసెంబర్ 15 : అలీసాగర్ కాలువ కింద సాగు చేసే రైతులకు నీటిని విడుదల చేయాలని అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మౌలానా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరినదిలో పుష్కలంగా నీరున్నందున అలీసాగర్ కాలువ కింద రైతులకు నారు, ఆరుతడి పంటలు పండించుకునే అవకాశం కల్పించాలని, రైతులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చొరవ తీసుకొని సాగు నీటిని విడుదల చేయాలని కోరారు.

బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవాలి

మాట్లాడుతున్న నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్15: బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సీపీఎం కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బాపూజీ వచనాలయ పరిరక్షణ కమిటీ నాయకులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా బాపూజీ వచనాలయ ఎన్నికలు నిర్వహించారని అన్నారు. కల్లు, సారా, లిక్కరు కాంట్రాక్టర్లు అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. అలాంటి వారికి కమిటీలో ఎందుకు అవకాశం కల్పించారని ప్రశ్నించారు. దొంగ ఓట్లు వేసి అధ్యక్షుడిని గెలిపించారని ఆరోపించారు. దోమకొండ నుంచి 30వేల పుస్తకాలు వచనాలయానికి అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కోనేటి సాయిలు, రవిందర్, విద్యార్థి సంఘం నాయకుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట తండాలో కొనసాగుతున్న పికెటింగ్

రెంజల్, డిసెంబర్ 15 : మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన రెడ్యానాయక్‌పై మైనర్ బాలిక కుటుంబీకులు, బంధువులు దాడిచేసిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. అందుకు కారణమైన వారిని గుర్తించి కేసులు చేయడమే కాకుండా గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చేవరకూ పికెటింగ్ కొనసాగుతుందని రెంజల్ ఎస్సై సాయన్న ఆదివారం తెలిపారు. గ్రామంలో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నారుమడికి చలి ప్రభావం

- తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మోర్తాడ్‌లో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏవో హరీశ్

మోర్తాడ్, డిసెంబర్15 : యాసంగిలో చలి ప్రభావంతో వరి నారుమడి ఎదుగుదల సరిగా ఉండదని, ఆకులు ఎరుపు, పసుపరంగులోకి మారుతాయని, కొన్నిసార్లు నారుమడి చనిపోయే అవకాశముందని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి హరీశ్ రైతులకు సూచిస్తున్నారు. ఏవో తెలిపిన వివరాల మేరకు..

రోజూ సాయంత్రం వేళలో నారుమడిలో కొత్త నీరు పెట్టాలి, ఉదయం తీసివేయాలి. మళ్లీ కొత్త నీటిని పెడుతూ ఉండాలి. రోజూ సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి వాటిపై సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాల పట్టాలతో నారుమడిని కప్పి ఉంచి ఉదయం తీసివేయాలి. జింక్ లోపంతో ఏర్పడితే నారు ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. దీని నివారణకు రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు ఆరోగ్యంగా పెరిగేందుకు కిలో యూరియాకు రెండు గ్రాముల కార్బండిజమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు బారి నుంచి కాపాడుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు సరిపడే నారుమడి ఒక కిలో చొప్పున చల్లాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉండి మంచుతో కూడిన వాతావరణం ఉంటే అగ్గి తెగులు ఆశించకుండా ట్రై సైక్లోజాల్ 0.6 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైన చెప్పిన విధంగా రైతులు నారుమడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సూచించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించని వాహనదారులు

రెడ్ సిగ్నల్ పడినా ముందుకు వెళ్తున్న మున్సిపల్ చెత్తబండి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్15: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్‌ను వాహనదారులు పాటించడం లేదని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ చెత్తబండి మంగళవారం రెడ్ సిగ్నల్ పడినా ముందుకు వెళ్లిపోయింది. చెత్త తరలించే వాహనానికి నంబరు ప్లేటు లేకపోవడంతో జరిమానా పడదనే ఉద్దేశంతో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పలు శాఖల అధికారుల కార్లు కూడా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికతో చదవాలి

విద్యార్థులకు విద్యాభ్యాసంపై దిశానిర్దేశం చేస్తున్న వక్త తిరునగరి శ్రీహరి

బోధన్, డిసెంబర్ 15 : విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికతో విద్యాభ్యాసం చేసి, లక్ష్యాన్ని సాధించాలని పలువురు వక్తలు సూచించారు. పట్టణంలోని శ్రీసాయి ప్రసన్న ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన 'దిక్సూచి' కార్యక్రమంలో వక్తలు తిరునగరి శ్రీహరి, నరహరినాయక్, జీవన్‌రావుతో పాటు యార్లగడ్డ శ్రీనివాస్‌రావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యాభ్యాసం చేయాలని, వారి కష్టాన్ని గుర్తించాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పూదోట జయప్రకాశ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ, డిసెంబర్ 15 : బాల్కొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌కు మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం స్వాగతం పలికారు.

జోరుగా వరినాట్లు.. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలు

మోర్తాడ్ శివారులో వరినాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

మోర్తాడ్, డిసెంబర్ 15 : రబీ పంటకు సంబంధించి వరినాట్లు జోరుగా వేస్తున్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో వరినాట్లు వేసేందుకు బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలు మధ్యవర్తి ద్వారా వరినాట్లు వేయడానికి వెళ్తుంటారు. కూలీలకు ఎకరానికి రూ.4వేల వరకు ఇస్తుంటారు. వరినాట్ల సీజన్ ముగిసే వరకు ఇతర రాష్ట్రాల కూలీలు ఇక్కడే ఉంటారు. నాట్లు ముగిసిన తరువాత తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోతారు.

ప్రశాంతంగా కొనసాగిన గ్రూప్-2 పరీక్షలు

ఆర్మూర్‌లో ఓ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్15 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కోసం ఆర్మూర్‌లో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. గంట ముందు అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు అనుమతిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో క్షత్రియ కళాశాల, నారాయణ, కృష్ణవేణి, భాషిత పాఠశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, ప్రభుత్వ డిగ్రీ, విజేత, నరేంద్ర, నరేంద్ర ఉమెన్స్, నరేంద్ర పీజీ కళాశాల కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మొత్తం 3,988 మంది అభ్యర్థులకు గాను 1,375 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,613 మంది గైర్హాజరయ్యారు.

నీటి ఎద్దడి నివారణకు బోరు మోటారు ఏర్పాటు

బోధన్‌లో నీటి ఎద్దడి తీర్చేందుకు బోరు వేయిస్తున్న నాయకులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 15 : బోధన్ పట్టణంలోని 24వ వార్డులో నీటి ఎద్దడి నివారణకు ఆదివారం బోరు వేయించారు. వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తమ కాలనీలో నీటి ఎద్దడి ఉన్నదని, స్థానిక మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ సతీమణి, ఆయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఆయేషా ఫాతిమాకు నివేదించడంతో ఆమె సానుకూలంగా స్పందించి, కాలనీలో బోరు వేయించేందుకు కావాల్సిన ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు రవీందర్ యాదవ్ కాలనీవాసులతో కలిసి బోరు వేయించారు. ఆయేషా ఫాతిమాకు వార్డు కౌన్సిలర్, నాయకులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎడపల్లిలో బైక్ చోరీ

ఎడపల్లి, డిసెంబర్ 15 : మండల కేంద్రంలో బైక్ చోరీ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బోధన్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన సిద్దోళ్ల హన్మాండ్లు వ్యవసాయ పనుల నిమిత్తం మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ పొలంలో కూలీ నిమిత్తం ఉదయం ఎడపల్లి శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల వద్ద రోడ్డుకు అవతలి వైపున బైక్‌ను పార్క్ చేసి పొలం పనికి వెళ్లాడు. పని ముగించుకొని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టూ వెతికినా కనిపించక పోయేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛకాలనీ.. సమైక్యకాలనీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 15 : పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ.. సమైక్యకాలనీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు సుంకె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పిచ్చి మొక్కలు, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించినట్లు చెప్పారు. కాలనీ అభివృద్ధి చెందాలంటే కాలనీ సభ్యులు అందరూ ఒక్కటిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీరామ స్వర్ణపాదుకల పల్లకీ పాదయాత్ర

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 15: రామరాజ్యం ఫౌండేషన్, రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి 14 రోజుల పాటు శ్రీరామ పాదుకల పల్లకీ పాదయాత్ర హైదరాబాద్ నుంచి అయోధ్య వరకు కొనసాగుతుందని రామరాజ్యం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నంగి దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్మూర్ పట్టణానికి ఈ నెల 19వ తేదీన పాదయాత్ర చేరుకుంటున్న సందర్భంగా జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో పల్లకీ పాదయాత్ర కరపత్రాలను ఆయన ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. లోక కల్యాణార్థం పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రామదాసి రామదీక్ష గురుపీఠం గురుస్వామి సురేశ్ ఆత్మారం మహరాజ్, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పెంట జైలేంధర్, గురుస్వామి నగేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.

NT-327118

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాంగ్రెస్ నాయకులవి.. నిరాధార ఆరోపణలు

ఏర్గట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబర్ 15 : కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌పై నిరాధార, బద్నాం చేసే ప్రసంగాలు చేశారని, ఇటువంటి అబద్ధపు మాటలు బంద్ చేయాలని, లేని పక్షంలో తమ తడాఖా చూపిస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, తాజా మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఏర్గట్లలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై నిరాధారమైన, బద్నాం చేసే ప్రసంగాలు చేశారన్నారు. ఎన్నికల్లో 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను నట్టేట ముంచడమే గాకుండా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గు చేటని, ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య, సింగసారం గంగారాం, నాయకులు దేవుడు నర్సయ్య, చిన్న సాయన్న, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, జైనొద్దీన్, కొలిప్యాక శ్రీనివాస్‌రెడ్డి, బద్దం రమేశ్‌రెడ్డి, బద్దం హన్మాండ్లు, పాలింగ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చేయూత

మోర్తాడ్, డిసెంబర్ 15 : మెండోరా మండల కేంద్రంలో వారం రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధమైన వారికి మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అండగా నిలిచారు. ఇండ్లుకోల్పోయిన దేవమల్లు, సాయన్నకు చెరో రూ.10వేల చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. ఎమ్మెల్యే అందించిన సాయాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు బాధితులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, సొసైటీచైర్మన్ రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ గంగాధర్, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు గంగారెడ్డి, మోహన్, శ్రీనివాస్, సాయన్న, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు